## నేషనల్ హైవే 340సి పనుల్లో నాణ్యతపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆగ్రహం



**కర్నూలు పెన్ పవర్ మే 31 :** ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరులో జాతీయ రహదారి 340సి పనులను స్థానిక ఎమ్మెల్యే గిత్త జయసూర్యతో కలిసి రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. జాతీయ రహదారి 340సి పనుల్లో నాణ్యతపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. నేషనల్ హవే 340సికు ఇరువైపులా నాణ్యత, బలం లేని మట్టిని కాంట్రాక్టర్ వాడటంతో.. కోతకు గురికావడం జరిగిందన్నారు. గతంలో కూడా ఈ కాంట్రాక్టర్ నాణ్యత లేని పనులు చేయడం జరిగిందన్న మంత్రి గతంలో సదరు కాంట్రాక్టర్ నాణ్యత లేని రోడ్ల నిర్మాణ పనులపై వార్తల నేపథ్యంలో.. విజిలెన్స్ ఎంక్వైరీ చేయమని ఆదేశిస్తే.. ఇప్పటి వరకు ఆ రిపోర్టు కూడా రాని పరిస్థితి ఈ విజిలెన్స్ ఎంక్వైరీ కనుమరుగవడం వెనుక ఎవరు ఉండి నడిపిస్తున్నారో బయట పెడతామని, నేడు జాతీయ రహదారుల నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నాయి. ప్రజాసొమ్మును దుర్వినియోగం చేసి, నాణ్యత లేని రోడ్లను నిర్మించే కాంట్రాక్టర్ల విషయంలో రాజీపడొద్దని సాక్షాత్తూ ముఖ్యమంత్రే చెప్పారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని రోడ్ల వల్ల ప్రజలు ప్రమాదాల పాలయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ ఘటనపై ప్రత్యేకమైన విచారణ జరిపిస్తా రోడ్డు అగ్రిమెంట్ మేరకు పనులు చేశారా అనేది కూడా ప్రశ్నార్థకమే. క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికేట్‌లు జారీ చేసిన అధికారులపై కూడా విచారణకు ఆదేశిస్తామన్నారు.

# పెన్ పవర్

## వై.ఎస్.ఆర్. కడప
## అన్నమయ్య జిల్లా

# ఇళ్ళ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ మే 31 :** వర్షాకాలం మొదలైనందున ఇరిగేషన్, పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా,వైద్య ఆరోగ్య శాఖల అధికారులు అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుండి స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్ లు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, జిల్లా అధికారులతో కలెక్టర్ యోగాంధ్ర, హౌసింగ్, రెవిన్యూ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం మొదలైనందున లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వరద వచ్చే ఇబ్బంది ఉన్న ప్రాంతాలను పరిశీలించాలని, కెనాల్స్, చెరువు కట్టల వద్ద మరమ్మత్తులు ఏమైనా చేయాల్సి ఉంటే వాటిని చేపట్టాలని కలెక్టర్ జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీల్లో, గ్రామపంచాయతీల్లో డ్రైనేజ్ బ్లాక్ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లను ఈవో పీఆర్డీలను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు వాటర్ పైప్ లైన్ లను చెక్ చేయాలని, ఓహెచ్ఎస్ఆర్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు యాంటీ లార్వా, ఫాగింగ్ తదితర కార్యక్రమాలను చేపట్టి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వారం లోపు ఈ శాఖల అధికారులు ఇందుకు సంబంధించి న నివేదికను తనకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే వారిని రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. పెద్దకడబూరు మండలం రిజిస్ట్రేషన్ లో చాలా వెనుకబడి ఉందని, అలాగే దేవనకొండ, ఎమ్మిగనూరు, కోసిగి, బెళగల్ , మంత్రాలయం , కర్నూల్ రూరల్ మండలాలు కూడా రిజిస్ట్రేషన్ చేయడంలో పురోగతి తీసుకుని రావాలన్నారు.. కర్నూలు అర్బన్, గోనెగండ్ల మండలాలు రిజిస్ట్రేషన్ చేయడంలో ముందున్నాయన్నారు..అలాగే జూన్ 21 వ తేదీన యోగా దినోత్సవం నిర్వహించేందుకు అన్ని గ్రామాల్లో, మున్సిపాలిటీ లలో వేదికలు గుర్తించాలని, యోగా చేసేందుకు వీలుగా వసతుల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. వెన్యూ రిజిస్ట్రేషన్ లు కర్నూలు అర్బన్, ఆదోని అర్బన్ లో పెండింగ్ లో ఉన్నాయని, త్వరితగతిన తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. ప్రతి వారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ లో 90 శాతం అర్జీలు రెవెన్యూ శాఖవే ఉంటున్నాయని కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ ల దగ్గరకు సమస్యలు రావడం లేదని, అన్నీ కలెక్టరేట్ కే వస్తున్నాయని, మండల స్థాయిలో సమస్యలు పరిష్కరిస్తే కలెక్టరేట్ కు ఎందుకు వస్తారని కలెక్టర్ తహసీల్దార్లను ప్రశ్నించారు.. రెవెన్యూ శాఖకు సంబంధించి వచ్చిన అర్జీలను 5 రకాలుగా విభజించుకోవాలని గతంలో కూడా చెప్పడం జరిగిందన్నారు.. సర్వే, అప్పీల్ పిటిషన్లు, కరెక్షన్, సివిల్ డిస్ప్యూట్, కోర్టు ఆర్డర్ ల వారీగా పిటిషన్లను విభజించుకుని ఒక స్పష్టతతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ డి ఓ లు, తహసీల్దార్లు సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పది రోజుల తర్వాత ఈ అంశం పైన డీటెయిల్ రివ్యూ చేస్తామని, అర్జీల పరిష్కారం ఏ విధంగా జరుగుతోంది అని పరిశీలించేందుకు ఆర్డీవోలతో పాటు డిప్యూటీ కలెక్టర్లను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లను కూడా నియమించడం జరిగిందన్నారు. హౌసింగ్ ఫర్ ఆల్ కి కార్యక్రమంలో భాగంగా ఇళ్ల స్థలాలు లేని పేదల నుండి దరఖాస్తులు తీసుకోవాలని , చెప్పినప్పటికీ ఈ అంశంలో పురోగతి లేదన్నారు.. జిల్లా అంతటా ఇంటి పట్టాల కొరకు కేవలం 4 వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకోవడం ఏంటని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.. హాలహర్వి లో 2, కృష్ణగిరి లో 3, తుగ్గలి 6, గూడూరు అర్బన్ 0 దరఖాస్తులు రావడం ఏంటి అని కలెక్టర్ సంబంధిత తరువాయి 6లో..

## భక్తుల కోసం టీటీడీ సిబ్బంది అహర్నిశలు కృషి



**తిరుమల పెన్ పవర్ మే 31 :** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తుల కోసం టీటీడీ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నా భక్తుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం సరికాదని టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి అన్నారు. వేసవి సెలవుల కారణంగా తిరుమలలో అధిక రద్దీ నెలకొనడంతో శిలాతోరణం దగ్గర మొదలవుతున్న దర్శన క్యూలైన్లను ఆయన శనివారం పరిశీలించారు. భక్తులకు పంపిణీ చేస్తున్న అన్న, పానీయాలు గురించి వారితో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. భక్తులందరూ టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై అదనపు ఈవో వద్ద సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నిన్న ఓ వ్యక్తి దర్శన క్యూలైన్ లో అన్న ప్రసాదాలు అందలేదని నినాదాలు చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయనను వెంటనే సంప్రదించి ఆరా తీయగా తనకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో రద్దీ గురించి అవగాహన లేకపోవడంతో దర్శన సమయం ఆలస్యమవుతున్నదని తాను అసహనంతో నినాదాలు చేసినట్లు ఒప్పుకున్నారు. అయితే క్యూలైన్‌లో అన్న ప్రసాదాలు, పాలు అందిస్తున్నది గమనించి తన తప్పును గ్రహించి మానసిక క్షోభకు గురై, పశ్చాత్తాపంతో తన ప్రవర్తనను క్షమించమని కోరినట్లు కూడా ఆ భక్తుడి తెలియజేశాడని చెప్పారు. టీటీడీ అధికారులు ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షిస్తూ భక్తులకు అందిస్తున్న సదుపాయాలను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. వేసవి సెలవుల నేపథ్యంలో ప్రతిరోజూ ఒక లక్షకు పైగా భక్తులు స్వామివారి దర్శనం కోసం వస్తున్నారని, వారాంతాల్లో ఈ సంఖ్య 1.20 లక్షలు దాటుతోందని చెప్పారు. వీఐపీ బ్రేక్, శ్రీవాణి దర్శనాలను తగ్గించి సాధారణ భక్తులకే దర్శనాల్లో పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రతిరోజూ 60శాతానికి పైగా సర్వ దర్శనానికి విచ్చేసే భక్తులే స్వామివారిని దర్శించుకుంటున్నారని చెప్పారు. సాధారణ రోజులకంటే 10 వేల మందికి భక్తులకు అదనంగా దర్శనమయ్యేందుకు టీటీడీ సిబ్బంది రాత్రింబవళ్లు నిద్ర లేకుండా కష్టపడుతున్నారని తెలియజేశారు. క్యూలైన్లలోని భక్తులకు శ్రీవారి సేవకుల ద్వారా తరువాయి 4లో..



## ఇలకైలాసమైన శ్రీశైలంలో యోగాంధ్ర కార్యక్రమాలు



శ్రీశైలం/నంద్యాల, పెన్ పవర్ మే 31 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శనివారం శ్రీశైల మహాక్షేత్రంలోని గంగాధర మండపం నుండి నంది సర్కిల్ వరకు 1500 మందిచే నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, శ్రీశైలనియోజకవర్గం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, కార్య నిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు తదితరులు జ్యోతిప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ యోగా గురువు గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం కార్యక్రమములో యోగాను చేయించారు. ప్రముఖ సంస్కృత పండితులు డా. దీవి హయగ్రీవాచార్యుల వారు కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సంప్రదాయ నృత్యంతో యోగా కార్యక్రమం నిర్వహించబడింది. చిరంజివి గంధవళ్ళ రాధా రమణి గణపతి ప్రార్థన, సరస్వతి ప్రార్థన, శివస్తోత్రాలకు సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 21 నుంచి జూన్ 21 వ తేదీ వరకు నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా యోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలలోని అయిదు పర్యాటక ప్రదేశాలలో యోగ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం సూచించిన మేరకు శనివారం ఇలకైలాస సన్నిధిలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా 1500 మందితో యోగ నిర్వహించుకున్నామన్నారు. ఇందులో భాగంగానే జూన్ 7వ తేదీ మహానంది దేవస్థానంలో, 13వ తేదీ బెలుంగుహలు, 18వ తేదీన అహోబిలం, 20వ తేదీన పచ్చర్ల జంగిల్ క్యాంపులో యోగ కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలలో యోగ శిక్షకులను తయారుచేసి జిల్లా వ్యాప్తంగా 8 లక్షల మందికి యోగ నేర్పించి, అంతర్జాతీయ యోగా కార్యక్రమములో పాల్గొనేందుకు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 2014లో ఐక్యరాజసమితి భారతదేశంలో పుట్టిన యోగాను జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగాదినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో ఇప్పటి వరకు 170 దేశాలలో యోగ ప్రక్రియలను అవలంభిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో యోగా దినచర్యలో భాగమై ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు చిహ్నం కావాలని ఆకాంక్షించారు. జిల్లాలో ఈశాన్య భాగమైన శ్రీశైలమహాక్షేత్రంలో మొట్టమొదటి యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. నాట్యానికి, యోగానికి అధిదేవుడు పరమశివుడే నని, శివసన్నిధిలో యోగాభ్యసనాలు చేస్తే భగవంతుడి నిండైన ఆశీస్సులు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. యోగాగురువు యోగాంశాలను వివరిస్తూ అందరిచేత యోగాసనాలు చేయించడం సంతోషదాయకరమని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్యకరమైన జీవితం, సుఖసంతోషాలు, బాధల నుండి విముక్తి, మానసిక ప్రశాంతత మొదలైనవన్నీ యోగసాధన ద్వారా పొందవచ్చునని తెలిపారు. యోగా వలన శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఎన్నో మంచిఫలితాలు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈనెల 16వ తేదీన నంద్యాల పట్టణంలో దాదాపు 10 వేల మంది ఉద్యోగులు, సిబ్బందిచే యోగాసనాలు అభ్యసించేందుకు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 75 సంవత్సరాలు నిండిన వృద్ధులకు కూడా మూడు ప్రదేశాలలో యోగాసనాలు చేయించేందుకు కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. జూన్ 21వ తేదీన దాదాపు 8 లక్షల మందితో యోగ కార్యక్రమంలో భాగస్వాములు చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు.

## పేదల సంక్షేమానికి కట్టుబడిన ప్రజా సంక్షేమ ప్రభుత్వం

### - జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి, పెన్ పవర్ మే 31 :** రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం లక్ష్యంగా...ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను అర్హులైన లబ్ధిదారులకు ఉదయాన్నే సచివాలయం సిబ్బంది వారి ఇంటి వద్దకు వెళ్ళి క్రమం తప్పకుండా పింఛన్లను పంపిణీ చేస్తున్నారని, జూన్ 1న ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఒక రోజు ముందుగానే నేడు అంద చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు అని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం తిరుపతి ఎస్టీవీ నగర నందు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేసి పలువురు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్ సి ముని కృష్ణ ,డిప్యూటీ కమిషనర్ అమరయ్య తో కలిసి జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ జిల్లాలో సచివాలయ సిబ్బంది ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నారనీ, అలాగే కొనసాగించాలని తెలిపారు. జిల్లాలో మే నెలకు సంబంధించి జూన్ లో పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను 2,60,379 మంది ఫించన్ దారులకు సుమారు 111.74 కోట్ల రూపాయలు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు ను జూన్ 01 వ తేది ఆదివారం అయినందున ఒక రోజు ముందుగానే ఈ రోజు లబ్దిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ తరువాయి 4లో..

## విద్యార్ధి దశలోనే యోగాను అలవర్చుకోవాలి

### - అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమం



**అనంతపురం, పెన్ పవర్ మే 31 :** అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డియంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఆయుష్ అధికారులు డా.రామ్ కుమార్, డా.లాల్యా నాయక్, యోగా గురువులు కృష్ణవేణి, గురురాజా, డెమో త్యాగరాజ్, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అనిల్ కుమార్ మరియు యూనివర్సిటీ అధికారులు, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ హనుమాన్ కేనడి, డా కేశవరెడ్డి, డా.సపాన్ సిందే వారి సిబ్బంది, పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా డియంహెచ్ఓ మాట్లాడుతూ యూనివర్సిటీ ఉద్యోగులు అందరూ యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషకరమని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలందరూ యోగ చేయడం వల్ల ఎంతటి తరువాయి 4లో..

## పింఛన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

### జూన్ 4న విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు కార్యక్రమం



**అనంతపురం, పెన్ పవర్ మే 31 :** అనంతపురం నగరంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పలు కాలనీల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. శనివారం ముందుగా నారాయణపురం గ్రామపంచాయితీ లోని సోమనాథ్ నగర్ చౌరస్తా నుంచి పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం 41వ డివిజన్ లోని హనుమాన్ కాలనీ 60వ సచివాలయం వద్ద పింఛన్లు పంపిణీ చేశారు. ఆతర్వాత 50వ డివిజన్ లోని టి.టి.డి కళ్యాణమండపం వద్ద జరిగిన పింఛన్ పంపిణీలో పాల్గొన్నారు. 44వ డివిజన్ 1వ రోడ్డు ఏడీసీసీ బ్యాంకు వద్ద కూడా పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి నెల సచివాలయం సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పింఛన్ల పంపిణీ చేస్తున్నారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. తమకు నెల నెల క్రమం తప్పకుండా ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే 3 వేల రూపాయలు ఉన్న పింఛన్ ను 4 వేలకు పెంచామన్నారు. పూర్తిగా అనారోగ్యానికి గురైన వారికి 15 వేల రూపాయలు పింఛన్ ఇస్తున్నట్టు తెలిపారు. జూన్ ఒకటవ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే మే 31 తారీఖునే పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి దగ్గర నుంచి కిందిస్థాయి కార్యకర్త వరకు నేరుగా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇస్తున్నామంటే తమ ప్రభుత్వ తరువాయి 4లో..

## దేశంలోకల్లా పింఛన్లు రాష్ట్రంలోనే అధికం : మంత్రి టీజీ భరత్



**కర్నూలు పెన్ పవర్ మే 31 :** దేశంలోకెల్లా అధిక మొత్తంలో సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తున్న రాష్ట్రం ఏపీ ఒక్కటేనని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం 48వ వార్డు అమీర్ హైదర్ నగర్‌లో మంత్రి, నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబుతో కలిసి పలువురు లబ్దిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. పింఛన్ల నగదు సక్రమంగా జరుగుతుందా? లేదా? అని లబ్దిదారులను ఆరా తీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీనిచ్చారు. బి.నాగమ్మక, సందేపోగు సుకుమార్, వడ్డే లక్ష్మీదేవి, యూ.లక్ష్మన్నలకు వృద్ధాప్య, కే.డ్యాని, వి.రామకృష్ణలకు దివ్యాంగుల పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆదాయం సమకూర్చుకోలేని వివిధ వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, వారికి క్రమం తప్పకుండా ప్రతి నెలా 1వ తేదీ, ఆరోజు సెలవు రోజు ఉంటే ఒకరోజు ముందే పింఛన్ల నగదు ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గడిచిన 11 నెలలుగా ఎలాంటి ఆటంకం లేకుండా పక్కా ప్రణాళిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. దేశంలో పింఛన్ల కోసం వేల కోట్లు కేటాయిస్తున్నది ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమేనని, పేదల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. పేదలకు రోజువారీ ఖర్చులకు పింఛన్ల నగదు ఎంతగానో ఉపయోగపడుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తున్నామని పేర్కొన్నారు. అమీర్ హైదర్ నగర్ నందు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, తొలి దశలో రూ.1.54 కోట్లు కేటాయించి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పిస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇవ్వడం జరిగిందని, ఒక్కొక్కటిగా తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయం పెంచి ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చుస్తారని పేర్కొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సామాజిక పింఛన్ల పంపిణీ ఒక్క రాష్ట్రంలోనే పకడ్బందీగా జరుగుతుందని, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ల నగదు అందిస్తోందన్నారు. నగరంలో ప్రతి నెలా సుమారు 36 వేల మందికి రూ.16 కోట్ల రూపాయలు పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ఆమీర్ హైదర్ కాలనీ రహదారులు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టామని,



రూ.40 లక్షలతో డబ్లూబియం రహదారి నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియ టెండర్ దశలో ఉందని, రూ.1.16 కోట్ల సిసి రహదారి నిర్మాణానికి సైతం చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

## పొగాకు క్యాన్సర్‌కు కారణం




**అనంతపురం, పెన్ పవర్ మే 31 :** ప్రపంచ పొగాకు నివారణ దినము సందర్భంగా నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మెడికల్ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ రెస్పిరేటరీ మెడిసిన్, డిపార్ట్మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డా.ఎస్.మాణిక్యరావు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకాలు మన జీవితాలను చిన్నాభిన్నం చేస్తాయని, పొగాకు క్యాన్సర్ కు కారకమని, వైద్య విద్యార్థులు ఎవ్వరు పొగాకు ఉత్పత్తుల జోలికి వెళ్లవద్దని పిలుపు ఇచ్చారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆచార్య డా.కె.ఎస్.ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ఉంటామని ప్రమాణం చేసుకుని మంచి ఆరోగ్యంతో జీవించి కుటుంబానికి రక్షణగా నిలవాలని, ఊపిరితిత్తుల క్యాన్సర్ కు పొగాకు దారితీస్తుందని తెలిపారు. ఆ తరువాత రెస్పిరేటరీ మెడిసిన్ సహాయ ఆచార్యులు డా. శ్రీధర్ పొగాకు ఉత్పత్తుల దూరంగా ఉంటామని అందరితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో శ్వాసకోసుల వ్యాధి విభాగం ప్రధాన విభాగాధిపతి ఆచార్య డా.రామస్వామి, డా.అశోక్ కుమార్, డా.కావేటి సతీష్ కుమార్, డా.సౌజన్య లక్ష్మి, ఇతర డాక్టర్లు సురేష్, ఆదినటేష్, సుమన గోపీచంద్, మనోరంజన్ రెడ్డి, అనిల్ కుమార్, వరదరాజులు, నీరజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.ఆదిరెడ్డి పరదేశి నాయుడు, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల, కౌమార కార్మిక వ్యవస్థ నిషేధ మరియు నియంత్రణ చట్టం అమలుకు చర్యలు : కలెక్టర్




**చిత్తూరు, పెన్ పవర్ మే 31 :** బాల మరియు కౌమార కార్మిక వ్యవస్థ (నిషేధ మరియు నియంత్రణ) చట్టం – 1986, (సవరణ చట్టం 2016 ) ను పగడ్బందీ గా అమలు కు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జిల్లా సచివాల యంలోని సమావేశపు మందిరం నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బాల మరియు కౌమార కార్మిక వ్యవస్థ నిషేధ మరియు నియంత్రణ చట్టం–(1986 సవరణ చట్టం–2016) సమర్థవంతంగా అమలుకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం కార్మిక శాఖ ఆధ్వర్యంలోనిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బాల మరియు కౌమార కార్మిక వ్యవస్థ చట్టం– 1986 (సవరణ చట్టం 2016) మేరకు సెక్షన్ 3 కింద ఏ వృత్తి లో అయినా మరియు ఏ ప్రక్రియలో అయినా 14 సంవత్సరాల లోపు బాలబాలికలచే పని చేయించుకోవడం లేదా పనిలోకి అనుమతించడం పూర్తిగా నిషేధం అన్నారు. సెక్షన్ 3ఎ కింద 14 సంవత్సరాల వయసు నిండిన 18 సంవత్సరాల వయస్సు పూర్తి కాని కౌమార వయస్సు లో ఉన్న వారి చేత నిర్దేశిత ఏ మరియు బి షెడ్యూల్లో పేర్కొన్న నిషేధిత ప్రమాదకర వృత్తులు మరియు ప్రక్రియలో పని చేయించుకోవడం లేక పనిలోకి అనుమతించడం పూర్తి గా నిషేధించడం అయిన దని,ఈ సెక్షన్లలను ఉల్లంఘించిన వారికి ఆరు నెలల నుండి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు 20 వేల నుండి 50 వేల వరకు జరిమానా విధించబడుతుందని లేదా శిక్ష మరియు జరిమానా రెండు కూడా విధించ బడతాయని చట్టంలో పేర్కొనడంజరిగిందన్నారు. బాల కార్మికుల గురించి ఏదైనా ఫిర్యాదుకై చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 ని సంప్రదించవచ్చునన్నారు. ఈ చట్టాన్ని సమర్థవంతం గా అమలు చేయడంలో డివిజన్ స్థాయిలో పోలీసు, మరియు రెవిన్యూ శాఖలను సమన్వయం చేసుకొని కార్మిక వ్యవస్థ ముందుకు వెళ్లడం ద్వారాసత్ఫలితాలు ఉంటాయని తెలిపారు. కార్మిక శాఖ మండల స్థాయిలో పోలీసు, రెవెన్యూ సంబంధిత శాఖలను సమన్వయం చేసుకొని తనిఖీలు నిర్వహణ చేపట్టడం ద్వారా ఇటుక బట్టీలు, మైనింగ్ పరిశ్రమల వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీల వద్ద, డైరీ పరిశ్రమలలో ఉన్న బాల కార్మికులను గుర్తించేందుకు అవకాశాలు ఉంటాయ న్నారు. ఈ దిశగా పనిచేయాలన్నారు. బడి బయటి పిల్లలను గుర్తించడం తో పాటు వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడమే కాకుండా క్రమం తప్పకుండా పాఠశాలలకు వచ్చేలా చొరవ విద్యా శాఖ అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశం లో భాగంగా కార్మిక శాఖ చే బాల కార్మిక వ్యవస్థ నిషేధ చట్టం నకు సంబంధించిన మరియు బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని నకు సంబంధించిన అవగాహన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి ఓంకార్, సమగ్ర శిక్ష ఏపిసి వెంకటరమణ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వరి,రియల్ ఎడ్యుకేషన్ మరియు లిటరసీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా

## జిల్లా వ్యాప్తంగా 5 లక్షల మొక్కలు నాటే మెగా కార్యక్రమం

మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి, పెన్ పవర్ మే 31 :** జూన్ 5 వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 5 లక్షల మొక్కలు నాటేలా మెగా కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సమన్వయం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల పెంపకం పై జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, డ్వామా పి డి శ్రీనివాస ప్రసాద్, డి పి ఓ సుశీలదేవి సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మిషన్ హరితాంధ్రప్రదేశ్ వనం మనం కార్యక్రమంలో భాగంగా జూన్ 5వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం లో మొక్కలు నాటే మెగా కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. ఈ సంవత్సరం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం ప్రపంచీకరణ అనే థీమ్‌తో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమానికి ముందుగా జిల్లాలోని అన్ని మండలాలు మున్సిపాలిటీ పరిధిలో మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. చెట్ల పెంపకం పర్యావరణ పరిరక్షణకు చాలా అవసరమని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు. కావున నాటే ప్రతి మొక్క బ్రతికేలా చూసుకోవాని తెలిపారు. అటవీశాఖ అధికారులు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం మరియు ఇతర కార్యకలాపాలను సిద్ధం చేసుకొని లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను నాటేలా చూడాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వ భూములలో రోడ్లకు ఇరు వైపుల మొక్కలు నాటడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఏపీడీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పరిధిలో ఉన్న మండల గ్రామస్థాయిలో వివిధ రకాల మొక్కల పంపిణీకి సంబంధించిన సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. తోటల పెంపకంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు అధికారులు సమన్వయం చూసుకోవాలని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గం సంబంధించి చిన్న గొట్టికల్లు , ఎర్ర వారి పాలెం మండలంలో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంటుందని, అక్కడ నిమ్మకాయల తోటల పెంపకం ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగం కావచ్చు అని పిలుపునిచ్చారు.

## హరితాంధ్రలో భాగంగా జూన్ 5వ తేదీన మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతం చేయాలి

### జిల్లాలో లక్ష మొక్కలు నాటాలి : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు , పెన్ పవర్ మే 31 :** హరితాంధ్ర లో భాగంగా జూన్ 5 వ తేదీన మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 5 వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హరితాంధ్ర కార్యక్రమంలో జిల్లా లో ఒక లక్ష మొక్కలు నాటాలని కలెక్టర్ ఆదేశించారు.. అటవీ శాఖ అధికారులు మొక్కలను అన్ని ప్రదేశాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కాలనీలు , కొండ ప్రాంతాలు, నీటి సమూహాలు , పార్కులు , కార్యాలయాలు, ఫారం పాండ్స్ తదితర అన్ని ప్రదేశాలలో మొక్కలు నాటాలని ఆదేశించారు. భాగంగా గార్గేయపురం నగరవనం లో నిర్వహించాలని ఆదేశించారు. మామిడి , సపోటా , దానిమ్మ , జామ , నేరేడు తదితర పండ్ల మొక్కలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జిల్లా కేంద్రానికి సంబంధించి గార్గేయపురంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ శ్యామల, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డి ఆర్ డి ఏ పిడి రమణారెడ్డి, డ్వామా పిడి వెంకటరమణయ్య, మెప్మా పీడీ నాగ శివలీల, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లు తేజశ్రీ , విజయకుమార్ , సోషల్ ఫారెస్ట్ అధికారులు,ఆదోని ,ఎమ్మిగనూరు ,గూడూరు మున్సిపల్ కమిషనర్లు , హార్టికల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి సమాచార శాఖలో ఎ.వి సూపర్ వైజర్ పుల్లయ్య సేవలు మరువలేనివి



**తిరుపతి, పెన్ పవర్ మే 31 :** సమాచార శాఖలో వివిధ హోదాలలో పని చేసి ఎ.వి సూపర్వైజర్‌గా నేడు పదవీ విరమణ చేసిన వై.పుల్లయ్య సేవలు మరువలేనివని, ఆయురారోగ్యాలతో ఉండాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య తదితర సమాచార శాఖ అధికారులు పేర్కొన్నారు. తిరుపతి సమాచార శాఖలో ఎ.వి.సూపర్వైజర్‌గా పనిచేసిన పుల్లయ్య శనివారం పదవీ విరమణ చేసిన సందర్భంగా కలెక్టరేట్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో తిరుపతి జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య మాట్లాడుతూ నేడు పదవీ విరమణ చేసిన ఎ.వి సూపర్వైజర్ పుల్లయ్య సమాచార శాఖలో ఎనలేని సేవలు చేశారని తెలిపారు. సుమారు 39 సంవత్సరాలు సుదీర్ఘంగా సమాచార శాఖలో పనిచేసిన ఆయన ముందు చూపుతో అధికారి అప్పజెప్పిన పనులను సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించే వారని కొనియాడారు. పదవీ విరమణ చేసిన ఏవి సూపర్వైజర్ పుల్లయ్య మాట్లాడుతూ... తాను 1985 అక్టోబర్ 25వ తారీఖున సినీ ఆపరేటర్ గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరానని అప్పటినుండి తన విధులను అధికారులు చెప్పిన విధంగా వారి సూచనలు పాటిస్తూ తన వృత్తి ధర్మాన్ని చేశానని తెలిపారు. అధికారులు, సిబ్బంది అందరి సహకారంతో తాను సమాచార శాఖలో 39 సం.ల 7 మాసములు సర్వీసులో సంతృప్తికరంగా విధులు నిర్వహించడం జరిగిందన్నారు. ఇందుకు సహకరించిన అధికారులకు, సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సమాచార శాఖ అధికారులు, సిబ్బంది, పుల్లయ్య ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పిఆర్ఓ ఈశ్వరమ్మ, ఎపిఆర్ఓ గోపి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## "పులివెందుల సబ్ జైలు విజిట్:"



**కడప పెన్ పవర్ మే 31 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి యామిని వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమములో పులివెందుల సబ్ జైలు సూపరింటెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

## ఉగ్రవాదం, మతోన్మాదం వేర్వేరు కాదు : సీపీఎం



**శ్రీకాళహస్తి/ పెన్ పవర్/ ప్రతినిధి/ 31 :** ఉగ్రవాదం, మతోన్మాదం వేర్వేరు కాదనీ, ఆ రెండింటితో దేశానికి ముప్పు ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. ఉగ్రవాదం, మతోన్మాదాన్ని అంతమొందించడంలో మోదీ సర్కార్ విఫలమైందని ధ్వజమెత్తారు. ఇండియా బ్లాక్, వామపక్ష పార్టీలు, క్రిస్టియన్, ముస్లిం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణ నాలుగు మాడ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సమైక్యతావాదులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని ఉగ్రవాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ సమగ్రత, సమైక్యతను బలపరుస్తూ ఐక్యతారాగం పాడారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఉగ్ర మూకల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన మోదీ సర్కార్ ట్రంప్ కు తలొగ్గి అర్ధాంతరంగా ముగించిందని మండిపడ్డారు. 140 కోట్ల భారతీయుల మనోభావాల్ని ట్రంప్ వద్ద తాకట్టు పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య సమరంలో బ్రిటీషర్లకు సలాం కొట్టి పారిపోయిన కాషాయి వాదులు ఉగ్ర మూకల ఏరివేతలోనూ అదే పంథా అవలంభించారని ఎద్దేవా చేశారు. దేశం కోసం పోరాడుతున్న కల్నల్ సోఫియా ఖురేషీపై సైతం కాషాయి వాదులు మత ఆరోపణలు చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు. దేశ సమగ్రతను కాపాడటంలో సమైక్యతా ంవాదులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర రెడ్డి, పాస్టర్ సుందర్ రాజు, పాస్టర్ ఆంబ్రోస్, పాస్టర్ కొండయ్య, పాస్టర్ భాస్కర్, లాల్ బాషా, అన్వర్ బాషా, మీర్జాన్ బాషా, మీర్జావలి, రఫీ, సీపీఎం నేతలు గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, వేణు, గురునాధం, ఈశ్వరయ్య, సంక్రాంతి వెంకటయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

**పలమనేరు మే 31, (పెన్ పవర్) :** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవము సందర్భంగా గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యులు డాక్టర్ లహరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగత్రాగడం వలన కలిగే ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలపై ప్రజలలో అవగాహన కల్పించడం మరియు పొగాకు వాడుటను తగ్గించడం లేదా పూర్తిగా మానిపించేందుకు ప్రోత్సహించడం యువతను మరియు సామాన్యులకు ఆరోగ్యకరమైన నిర్ణయాలు తీసుకునేలా అవగాహన కల్పించడం,అలాగే ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు కఠినమైన నిబంధనలు అమలు చేయడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.అలాగే ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ జ్యోతీశ్వర్, వైద్య ఆరోగ్య సిబ్బంది మరియు ఆశలు పాల్గొన్నారు.




## భక్తుల కోసం టీటీడీ సిబ్బంది అహర్నిశలు కృషి





**(3వ పేజీ తరువాయి)** నిరంతరాయంగా అన్న ప్రసాదాలు, టీ, కాఫీ, పాలు, మజ్జిగ, స్నాక్స్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య విభాగం ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. టీటీడీ సిబ్బంది కృషిని పట్టించుకోకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినేలా కొందరు ఇలా ప్రవర్తించడం సరికాదని ఆయన తెలిపారు. కొందరు అనధికారిక వ్యక్తులు దర్శన క్యూలైన్లలో భక్తులను రెచ్చగొడుతూ వీడియోలు చిత్రీకరిస్తున్నారని, అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విపరీత రద్దీ నేపథ్యంలో భక్తులు టీటీడీ అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని సంయమనం పాటిస్తూ స్వామివారిని దర్శించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీ సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ శ్రీ మధుసూదన్, వీజీఓ శ్రీ సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి కట్టుబడిన ప్రజా సంక్షేమ ప్రభుత్వం




**(3వ పేజీ తరువాయి)** ఇంటింటికి వెళ్లి పెన్షన్ లను అందజేస్తూ పెన్షన్లు అందిస్తున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకు న్నారు. ప్రతినెల ఒకటవ తేదీన మీ ఇంటి వద్ద కు వచ్చి పెన్షన్ల పంపిణీ చేస్తున్నారా అని లబ్ధిదారులను అడిగారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లా డుతూ సచివాలయ సిబ్బంది ఉదయాన్నే తమ ఇంటి వద్దకే వచ్చి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేస్తున్నారని కలెక్టర్ కు తెలిపారు. ఎస్టీవీ నగర నందు జయ రామయ్య, వృద్ధాప్య పెన్షన్ రూ.4000, వితంతు పెన్షన్ కింద సుబ్బమ్మ, జమున వారికి రూ.4000ను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి అందచేశారు. దేశంలో ఎక్కడా లేనంతగా పెంచిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను పేదలకు మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి అందిస్తున్నారని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లబ్ధిదారులకు వివరించారు. ముఖ్యమంత్రి పెంచి ఇచ్చిన పెన్షన్లు తమ జీవనోపాధికి ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పలువురు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ భాస్కర్, సచివాలయం సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే యోగాను అలవర్చుకోవాలి



**(3వ పేజీ తరువాయి)** రోగాలనైనా మన శరీరం తట్టుకుంటుందని, మనమందరం ఆరోగ్యంగా ఉండి మన కుటుంబాన్ని పోషించుకోగల మనో ధైర్యం, సంకల్పం ఇలాంటి యోగాతోనే సాధ్యమవుతుందన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు అందరూ యోగ వైపు మరలేల చూడాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల దేశ ప్రధాని నరేంద్ర మోడీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కి, అలాగే ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వికి యూనివర్సిటీలో కారక్రమం నిర్వహించడానికి సహకరించిన వైస్ ఛాన్సలర్‌కి ధన్యవాదాలు తెలిపారు.

## పింఛన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**(3వ పేజీ తరువాయి)** చిత్తశుద్ధి ఏంటో ఒకసారి తెలుసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2వేలు ఉన్న పింఛన్ ను 3వేలు చేసేందుకు ఐదేళ్లు పట్టిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. 200 అన్న క్యాంటీన్లు మళ్లీ ప్రారంభించామన్నారు. ప్రజల భూములను కాజేసే విధంగా ఉన్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేసినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 7 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొచ్చి 6 లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్నారన్నారు. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. జూన్ 4వ తేదీన తాము విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల క్రితం సచివాలయం ఉద్యోగిని స్థానిక నాయకుడు ఫోన్లో దూషించిన సంఘటన మీద ఖచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు. ఉద్యోగుల మీద ఎవరైనా దురుసుగా వ్యవహరిస్తే ఉపేక్షించేది ఉండదని, చర్యలు ఉంటాయన్నారు. ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకెళుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, తహసీల్దార్ హరికుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జూన్ 2 నుండి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వర పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**తిరుపతి పెన్ పవర్ మే 31 :** తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాలలో 2025-26వ విద్యా సంవత్సరానికి పలు కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి జూన్ 02వ తేదీ నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కళాశాలలో గాత్రం, వీణ, వేణువు, వయోలిన్, నాదస్వరం, డోలు, భరతనాట్యం, కూచిపూడి, నృత్యం, హరికథ, మృదంగం, ఘటం విభాగాల్లో ఫుల్‌టైమ్, విశారద(డిప్లొమా), ప్రవీణ(అడ్వాన్స్ డిప్లొమా) కోర్సులు ఉన్నాయి. ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాలలో ఫుల్‌టైమ్ సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు ఉన్నాయి. జూన్ 27వ తేదీ నుండి తరగతులు ప్రారంభమవుతాయి. ఇతర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాల కార్యాలయ పనివేళల్లో ఈవో, టిటిడి పేరుతో రూ.50/- డిడి తీసి దరఖాస్తు పొందొచ్చు. రెగ్యులర్ కోర్సులకు 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. సాయంత్రం కోర్సులకు 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయ పనివేళల్లో 9440793205, 9848374408 నంబర్లలో సంప్రదించగలరు.

## శ్రీ భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం

**తిరుమల పెన్ పవర్ మే 31 :** శ్రీవారి పంచ బేరాలలో ఒకటైన శ్రీ భోగ శ్రీనివాసమూర్తిని తిరుమల శ్రీవారి ఆలయంలో పల్లవరాణి సామవై ప్రతిష్ఠించిన రోజును పురస్కరించుకుని ఆలయంలో జూన్ 1వ తేదిన ప్రత్యేక సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు, శ్రీ భోగ శ్రీనివాసమూర్తి, శ్రీవిష్వక్సేనుల వారిని వేంచేపు చేస్తారు. శ్రీవారి మూలమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో కౌతుకమూర్తి అయిన శ్రీ మనవాళపెరుమాళ్(శ్రీ భోగ శ్రీనివాస మూర్తి)ను, ఆయనకు అభిముఖంగా శ్రీ విష్వక్సేనులవారిని ఆశీనులు చేస్తారు. తర్వాత శ్రీవారి మూలమూర్తిని శ్రీ భోగ శ్రీనివాసమూర్తికి కలుపుతూ దారం కట్టి అనుసంధానం చేస్తారు. అనంతరం వేద పండితులు వేద పారాయణం చేయగా, అర్చకస్వాములు ప్రత్యేక సహస్ర కలశాభిషేకాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. కాగా శ్రీవారి ఆలయంలోని ఆర్జిత సేవలన్నీ యథావిధిగా నిర్వహించనున్నారు.

## భారీ వర్షాలు నేపథ్యంలో సన్నద్ధతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**తిరుపతి, పెన్ పవర్ మే31 :** విపత్తు నిర్వహణపై అధికారులు ప్రణాళికలు రూపొందించుకుని ఆ దిశగా పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు. భారీ వర్షాలు హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ శనివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి విపత్తు నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ నుంచి సమాచారం అందిన మేరకు అధికారులు పంట కాల్వలు, చప్టాలు, చెక్ డ్యాములు ఎలా ఉన్నాయో పరిశీలించాలన్నారు. కాల్వలు, చెరువు కట్టలు బలహీనంగా ఉన్న వాటిని గుర్తించి బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. అధికంగా వర్షాలు కురిస్తే పట్టణ ప్రాంతాలలోని మురికి కాల్వలోని మురుగు రహదారులపై పొర్లి పారే అవకాశం ఉన్నందున ముందస్తుగా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. మలేరియా, డయేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకకుండా ముందుగానే నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తదుపరి జిల్లా కలెక్టర్ అధికారులకు టెలికాన్ఫరెన్స్ అనంతరం తదనుగుణంగా ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లోని ఆవాస ప్రాంతాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలపై, పునరావాస అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. విపత్తు నిర్వహణపై అధికారుల ప్రణాళికలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు.

## 2న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం





**కర్నూలు పెన్ పవర్, మే31 :** జూన్ 02 వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్‌సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చు**

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివోవి డాట్ ఇన్) వెబ్సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

### పలమనేరు నియోజకవర్గం

## రెండోసారి వైసీపీ రాష్ట్రయువజన విభాగం కార్యదర్శిగా కిషోర్



**పలమనేరు మే 31, (పెన్ పవర్) :** సమర్థవంతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల్లోకి దూసుకుపోతున్న యువనేతగా గుర్తింపు పొంది వైసీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా కిషోర్‌ను ఎన్నుకున్నారు. గంగవరం మండల కేంద్రానికి చెందిన వైసీపీ యువ నాయకుడు కిషోర్ రెండవసారి యువజన విభాగం కార్యదర్శిగా ఎన్నిక కావడంపై ఆయనను పలువురు అభినందించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకం ఉంచి పార్టీ కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డికి, రాష్ట్రమాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డికి అలాగే నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వెంకటగౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామ న్నారు.తనను అన్నివిధాలా ప్రోత్సాహించిన జిల్లా మాజీ డి.సి.సి.బి.ఛైర్మన్ ఎం.రెడ్డమ్మ కృష్ణమూర్తికి,జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప వాసుకి,రాష్ట్ర ఎంపీపీ సంఘం అధ్యక్షుడు ఎం రెడ్డప్పకు ధన్యవాదాలు తెలుపుతూ,రాబోయే రోజుల్లో వైసీపీ ని అధికారంలోకి తెచ్చేందుకు తనశక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## కౌలు రైతులకు సులభంగా రుణాలు మంజూరు చేయాలి

### స్వయం సహాయక సంఘాలు బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి : జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య





**కర్నూలు , పెన్ పవర్ మే 31 :** కౌలు రైతులకు సులభంగా రుణాలు మంజూరు చేయాలని , స్వయం సహాయక సంఘాలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో 6వ జిల్లా కోపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని 43 ప్రాథమిక సహకార సంఘాలు (ప్రాథమిక అగ్రికల్చర్ క్రెడిట్ కమిటీలు) కంప్యూటర్జేషన్ చేయడం జరిగిందని , డిస్టిక్ కోపరేటివ్ బ్యాంక్ లు కూడా ఇతర జాతీయ కమర్షియల్ బ్యాంకుల లాగా లావాదేవీలు , నియమాలు పాటిస్తూ ఆన్ లైన్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నందువలన కొన్ని సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల ను డిస్ట్రిక్ట్ కోపరేటివ్ బ్యాంకుల కు ట్రాన్స్ఫర్ చేసే చర్యలు మరియు క్రొత్తగా ఖాతాలు తెరిచే చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సిసిఆర్ కార్డ్స్ కలిగిన కౌలు రైతులకు సహకార బ్యాంకులు రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. పొలం యజమాని పంట రుణాలు తీసుకుని ఉన్నట్లయితే అతని అకౌంట్ ను హోల్డ్ లో పెట్టి అతనికి మళ్లీ పంట రుణం ఇవ్వకుండా చూడాలని, సీసీఆర్ కార్డు కలిగిన కౌలు రైతుకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు.నిర్ణీత సమయం తర్వాత కౌలు రైతు సిసిఆర్ కార్డు ను రెన్యువల్ కూడా చేయవలసిందిగా ఆదేశించారు. ప్రపంచంలో అత్యధిక ధాన్యపు నిలువలు చేయ తలపెట్టిన ప్రణాళికలో భాగంగా జిల్లా లో 10 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ (ఎం పీ ఎఫ్ సి) గోడౌన్ ల నిర్మాణాల నిమిత్తం ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ గొడౌన్ ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం అగ్రి ఇన్ఫ్రా ఫండ్ ద్వారా రుణాలు (4 శాతం వడ్డీ తో) మంజూరు చేస్తుందని ఆ రుణాల కు 33 శాతం సబ్సిడీ కూడా ఉంటుందని తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాలలోని స్వయం సహాయక బృందాలకు సహకార సంఘ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. మూడు లక్షల రూపాయలు రుణానికి 7 శాతం వడ్డీ 5 లక్షలకు 8 శాతం వడ్డీ అంతకంటే ఎక్కువ మొత్తానికి 9 శాతం వడ్డీ ఉంటుందని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. ఈ అవకాశాన్ని స్వయం సహాయక సంఘాలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని కోరారు. ఈ కమిటీలోకి పిడి డ్వామా మరియు పిడి మెప్మా లను డిసి డిసి లోకి సభ్యులుగా తీసుకోవడం జరిగిందని తెలిపారు. వీరి సభ్యులకు కోపరేటివ్ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయటం జరుగుతుందని తెలిపారు. కోపరేటివ్ సొసైటీ ల నిర్మాణానికి రెవెన్యూ శాఖ స్థలం కేటాయించినప్పుడు జిల్లా పరిషత్ సీఈవో మరియు పిడి డ్వామా ల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించే చర్యలు తీసుకోవాల్సిందిగా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఇందులో భాగంగా మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ల కు అప్రోచ్ రోడ్లను ఎన్ఆర్ఈజీఎస్ ఫండ్స్ ద్వారా డ్వామా విభాగం ఏర్పాటు చేసే కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కర్నూలు జిల్లా మిల్క్ ఫెడరేషన్ సంఘాన్ని 15 రోజుల లోగా స్థాపించవలసినది గా ఇంచార్జీ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశానికి డి సి ఓ రామాంజనేయులు , డ్వామా పిడి వెంకటరమణయ్య , జిల్లా కోపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ మరియు సీఈవో రామాంజనేయులు, అగ్రికల్చర్ జెడి వరలక్ష్మి , పిడి మెప్మా నాగ శివలీల, డిఎం సివిల్ సప్లై నాగ సుధా , మత్స్యశాఖ , మార్కెటింగ్, ఉద్యాన శాఖ , జిల్లా పరిషత్ ఏవో అధికారులు మరియు మొదలగు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చంద్రగిరి కోట వద్ద యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం : జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్.ఎస్



**తిరుపతి, పెన్ పవర్ మే31 :** జూన్ 4 తేదీన చంద్రగిరి కోట వద్ద నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, యువత తదితరులు పాల్గొనేలా చూడాలని, యోగా నిర్వహణ ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం యోగాంధ్ర క్యాంపెయిన్ లో భాగంగా చంద్రగిరి కోట వద్ద జూన్ 4న నిర్వహించనున్న యోగా కార్యక్రమం నిర్వహణపై జేసి శుభం బన్సల్, ఆర్డీఓ తిరుపతి రామ్మోహన్, పర్యాటక శాఖ ఆర్డి రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్ధన్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, ఎంపిడిఓ, ఆర్కియాలజీ తదితర అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో మన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు సంబంధించిన చంద్రగిరి కోట వద్ద జూన్ 4న నిర్వహించనున్న యోగాంధ్ర అవగాహన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, యువతను చంద్రగిరి, ఆర్సిపురం, తిరుపతి రూరల్ ఎంపిడిఓ లు మొబైలైజ్ చేయాలని ఆర్డీ టూరిజం సమన్వయం చేసుకోవాలని సూచించారు. జెసి గారు మొత్తం కార్యక్రమ పర్యవేక్షణ చేయాలని సూచించారు. శానిటేషన్ సంబంధించి డిపిఓ, ఉదయం 5గం. నుండి 9 గం.ల వరకు ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ శాఖ తగు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆర్డీవో తిరుపతి సమన్వయం చేయాలని అన్నారు. అలాగే త్రాగు నీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎస్ ఈ ఆర్ డబ్ల్యూ ఎస్ ను ఆదేశించారు. టూరిజం శాఖ వారు అన్ని ఏర్పాట్లు సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఔత్సాహిక ప్రజలు, యువత తదితరులను యోగా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా చూడాలని అన్నారు. యోగా పై ప్రజలకు అవగాహన కల్పించడం వారి జీవితంలో ఒక భాగంగా యోగా ఉండేలా వారిని మోటివేట్ చేయాలని అన్నారు. డ్రెస్ కోడ్ తెలుపు ఉండేలా చూడాలని అన్నారు. సదరు చంద్రగిరి కోట వద్ద నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాన్ని అందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

### డాక్టర్ కోటేశ్వరబాబు దయాళుత్వం

## పాత్రికేయుని కుటుంబానికి రూ.పది వేలు ఆర్థిక సాయం



**శ్రీకాళహస్తి/ పెన్ పవర్/ ప్రతినిధి/ మే 31 :** సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా లెక్కలేనన్ని జీవితాల్లో వెలుగులు నింపిన ప్రముఖ సంఘ సేవకులు, ఆంధ్రశ్రీ అవార్డు గ్రహీత, ఏపీడబ్ల్యుజే రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు మరోసారి దయాళుడై నిలిచాడు. వార్త దినపత్రిక తొట్టంబేడు మండల సీనియర్ పాత్రికేయులు చిట్టత్తూరు మెహర్ కుమార్ అకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సమాచారం తెలిసే సమయానికి బయట ప్రాంతంలో ఉండడంతో అంత్యక్రియలకు హాజరు కాలేకపోయారు. దీంతో స్వర్గీయ మెహర్ కుమార్ నివాసానికి పలువురు పాత్రికేయులతో కలిసి కోటేశ్వరబాబు శనివారం వెళ్లారు. మెహర్ మాతృమూర్తిని ఓదార్చి తామంతా మీ బిడ్డలమేనని ఆమెకు ధైర్యానిచ్చారు. కర్మక్రియల నిమిత్తం తనవంతు సాయంగా రూ.పదివేలను ఆర్థిక సాయంగా అందించారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తామంతా ముందుంటామని ఈ సందర్భంగా ఆ తల్లికి మాటిచ్చారు. అనంతరం కోటేశ్వరబాబు మాట్లాడుతూ మంచి హృదయం కలిగిన నిశ్వార్థ జర్నలిస్టు మిత్రుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. తన అక్షరాలతో కదలికలు తీసుకొచ్చి ప్రజలకు అండగా నిలిచిన సందర్భాలెన్నో ఉన్నాయని తెలిపారు. సీనియర్ జర్నలిస్టుగా మెహర్ పలువురికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎంతో మంది కొత్తగా వృత్తిలోకి వచ్చిన వారికి తన సలహాలు, సూచనలతో అక్షరాలను నేర్పి విలువలతో కూడిన జర్నలిజం చేశారని చెప్పారు. పాత్రికేయుల సంక్షేమం, అభివృద్ధే అజెండాగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే స్ఫూర్తితో ఇవాళ తమవంతుగా ఈ చిరుసాయం అందించామన్నారు. కర్మక్రియలకు సంబంధించి మరింత సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

## జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్, మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం : కలెక్టర్ వెంకటేశ్వర్




**తిరుపతి, పెన్ పవర్ మే 31 :** ప్రతి సోమవారం జిల్లా కేంద్రం తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు మరియు రెవిన్యూ డివిజన్ , మండల కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జూన్ నెల 2వ తేదీ సోమవారం రోజున ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటవరకు ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంట వరకు జిల్లా కలెక్టరేట్ తో పాటుగా డివిజన్, మండల కేంద్రాలలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని ప్రజలు గమనించి సద్వినియోగం చేసుకోగలరని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు అందరు కలెక్టరేట్ నందు నిర్వహించే పీజీ ఆర్ ఎస్ కార్యక్రమానికి, అలాగే డివిజన్, మండల కేంద్రాల్లో పీజీఆర్ఎస్ కు సంబంధిత అన్ని శాఖల అధికారులు ప్రతి సోమవారం తప్పక హాజరు కావాలని తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## కారుణ్య నియామకాల కింద 50 మందికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు





**కర్నూలు, పెన్ పవర్ మే 31 :** కారుణ్య నియామకాల కింద 50 మందికి జూనియర్ అసిస్టెంట్ లుగా ఉద్యోగాలు ఇస్తూ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందచేశారు. శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు కలెక్టర్ నియామక ఉత్తర్వులను అంద చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్&ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లుగా 05 మందికి, పంచాయతీ సెక్రటరీ Gr VI లుగా 04 (నలుగురికి), వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ లు గా 09 మందికి, మహిళా పోలీస్ గా 01(ఒక్కరికి), రెవెన్యూ డిపార్ట్మెంట్ లో జూనియర్ అసిస్టెంట్ లుగా 05 మందికి, వివిధ డిపార్ట్మెంట్లలో జూనియర్ అసిస్టెంట్లు గా 26 మందికి మొత్తం 50 మందికి జిల్లా కలెక్టర్ ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభ్యర్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు..ఇది మంచి అవకాశం అని, ఉద్యోగాలు పొందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు. ఉద్యోగాలు పొందిన వారంతా మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులుగా ఎదిగే అవకాశం ఉందని, ఇప్పటినుంచే అన్ని అంశాలను నేర్చుకుని, కెరీర్ ను డెవలప్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు..

**డిఆర్ఓ, ఏఓలను అభినందించిన కలెక్టర్**

50 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగ నియామక పత్రాలు అందచేసినందుకు కలెక్టర్ డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, ఏఓ విజయశ్రీ లను అభినందించారు.. ఇంతమందికి ఉద్యోగాలు ఇవ్వడం చిన్న విషయం కాదని, ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించినందుకు కలెక్టర్ వారికి అభినందనలు తెలియచేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ, చొరవ చూపడం వల్ల తమకు ఉద్యోగ నియామకం జరిగిందని అభ్యర్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సమావేశం లో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డిఆర్ఓ సి వెంకట నారాయణమ్మ, కలెక్టరేట్ ఏవో విజయశ్రీ, సంబంధిత సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

## జూన్ 2న జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ : జిల్లా కలెక్టర్



**చిత్తూరు, పెన్ పవర్ మే 31 :** జూన్ 02 వ తేదీన సోమవారం చిత్తూరు కలెక్టరేట్ లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ను ఉ.9.30 గం.ల నుండి మ.1 గం.వరకు కలెక్టరేట్ లోని సమావేశపు మందిరం నందు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉ.9 గం.కల్లా తప్పక హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీనితో పాటు నియోజక వర్గ,మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

## వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో "ఫ్యామిలీ యోగా" జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి



**కడప, పెన్ పవర్ మే 31 :** కడపలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియం మైదానంలో ఆదివారం నిర్వహించే "ఫ్యామిలీ యోగా" కార్యక్రమంలో ఆసక్తి కలిగిన వారు కుటుంబ సభ్యులతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. "యోగాంధ్ర- 2025" మాసోత్సవాల్లో భాగంగా.. ప్రత్యేకించి ఈ ఆదివారం (జూన్ 1వ తేదీ) ఉదయం 6 గం.. నుండి 8 గం..ల వరకు ఫ్యామిలీ యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు, అవ్వతాతలు మొదలైన మూడు కేటగిరీలకు చెందిన కుటుంబ సభ్యులు కలిసి పాల్గొనాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మే 21 నుండి జూన్ 21 వరకు నెల రోజుల పాటు జరిగే ఈ యోగా కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని, అంతర్జాతీయ యోగా వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ప్రతిఒక్కరూ యోగా ఆవశ్యకతను తెలుసుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలన్నారు.

## మధుమేహం, అధిక రక్తపోటు అవగాహన సదస్సు



**పెళ్లకూరు, పెన్ పవర్ ప్రతినిధి, మే 31 :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చిల్లకూరు గ్రామం నందు ప్రపంచ నాన్- కమ్యూనికబుల్ వ్యాధుల అవగాహన సదస్సులో భాగంగా పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం, హృదయ సంబంధిత వ్యాధులు వంటివి నాన్- కమ్యూనికబుల్ వ్యాధులపై దృష్టి సారించి సమగ్రఅవగాహనకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య బృందం సమతుల్యపోషక ఆహారం, వ్యాయామం ఒత్తిడిని అధిక అధికమించే వంటి ఆరోగ్యకరమైన జీవనశైలి యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రపంచ వ్యాప్తంగా అధికమవుతున్న వ్యాధులను నివారించడంలోజీవన శైలి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భారతదేశం వేగంగా ప్రపంచ మధుమేహం రాజధానిగా మారుతుందని పెరుగుతున్న అధిక రక్తపోటు, మధుమేహ బారాన్నిఎదుర్కోవడానికి జీవన శైలి మార్పులు తక్షణంఅవసరమని వివరించారు.అందులో భాగంగా ఉచిత వైద్య చికిత్సలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ సుజాత,డాక్టర్ జితేంద్ర, పీహెచ్ఎన్ విజయలక్ష్మి,హెచ్ విరూత్ వినయా,ఏఎన్ఎం భూలక్ష్మి,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూన్ 2వ తేదీన గుత్తిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

### - గుత్తి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, పెన్ పవర్ మే 31 :** జూన్ 2వ తేదీన సోమవారం గుత్తిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని గుత్తి పట్టణంలోని పత్తికొండ రోడ్డులో ఉన్న వసుధ ఫంక్షన్ హాల్ లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. గుత్తి మండల ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతపురం కలెక్టరేట్ లో గ్రీవెన్స్ స్వీకరణ ఉండదు, ప్రజలు గమనించగలరు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. అలాగే అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని సూచించారు.

## సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు చేతుల మీదుగా మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

**సూళ్లూరుపేట, పెన్ పవర్ మే 31 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆధ్వర్యంలో డాక్టర్. విజయశ్రీ, శాసనసభ్యురాలు, సూళ్లూరుపేట నియోజకవర్గం, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, సహాయ సహకారంతో, 10-06-2025 తేదీన అనగా ఈ మంగళవారం, ఉదయం 8 గంటల నుంచి నాయుడుపేట లోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, వెంకటగిరి రోడ్డు, నాయుడుపేట నందు మెగా జాబ్ మేళా నిర్వహించబడును. ఈరోజు ముఖ్య అతిథులుగా గౌరవ ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా డా.విజయశ్రీ, శాసనసభ్యురాలు, సూళ్లూరుపేట నియోజకవర్గం వారు మాట్లాడుతూ, ఈ మెగా జాబ్ మేళాలో చదువుకుని ఖాళీగా ఉన్నటువంటి నిరుద్యోగ యువత కోసం, శ్రీ సిటీ, మేనకూరు సెజ్ , ఈఎంసి క్లస్టర్, తిరుపతి, మరియు చెన్నైలోని 17 బహుళ జాతీయ కంపెనీలలో 900 పైగా ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడును. కావున ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఐదవ తరగతి పైన పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ లేదా ఐటిఐ లేదా డిప్లమా లేదా ఏదైనా డిగ్రీలో లేదా పీజీలో ఉత్తీర్ణత అయిన యువతి యువకులు ఈ మెగాజాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వారు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు క్రింద తెలుపబడిన రిజిస్ట్రేషన్ లింక్ లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవలెను మరిన్ని వివరాలకు క్రింద తెలుపబడిన మొబైల్ నెంబర్లను సంప్రదించగలరు.

రిజిస్ట్రేషన్ లింకు :https://naipunyam.ap.gov.in/user-registration

రిజిస్ట్రేషన్ కోసం చివరి తేదీ 09-06-2025. మరియు స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా కలదు. ఇతర వివరములు కొరకు సంప్రదించండి : 0919985056929, 9154449677, 9988853335.(కాల్ సెంటర్) ఈ కార్యక్రమంలో డా.ఎం. మధుసూదన్ వర్మ, ప్రిన్సిపాల్, గవర్నమెంట్, డిగ్రీ కాలేజ్, నాయుడుపేట, నెలవల్ల సుబ్రహ్మణ్యం, ఎక్స్.ఎంపీ, ఎస్.శంకరయ్య, టిడిపి మండల ప్రెసిడెంట్, పెళ్లకూరు, నెలవల్ల రాజేష్, యువ నాయకులు, టిడిపి నాయుడుపేట, పార్ధసారథి, మరియు లిఆర్.లోకనాదం, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి, ఎం.చెంచయ్య, కోఆర్డినేటర్, ఏపీ ఎస్ఎస్డిసి, నాయుడుపేట.

**గమనిక :** మెగా జాబ్ మేళాకు( ఇంటర్వ్యూలకు) హాజరయ్యా యువతి యువకులు పైన ఇచ్చిన రిజిస్ట్రేషన్ లింకులో ఆధార్ ఓటిపితో ట్రైనీ (Trainee Registration) రిజిస్ట్రేషన్ చేసుకొని, మీ ప్రొఫైల్ లాగిన్ అయ్యి అన్ని కంపెనీలకు అప్లై చేసుకుని అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరవ్వ వలెను.

## నేటి నుండి చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ..!!

కడప, పెన్ పవర్ మే 31 : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జూన్ 1వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా రేషన్ పంపిణీని రేషన్ షాపుల ద్వారా మాత్రమే పంపిణీ చేయనున్నట్లు జేసీ అదితిసింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రేషన్ పంపిణీ కార్యక్రమం డీలర్ల ద్వారా ఆదివారాలు మరియు సెలవు దినాలతో సహా.. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. నిత్యావసర సరుకులు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మరియు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కార్డుదారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పోర్టబిలిటీ సౌకర్యం అందుబాటులో ఉన్నందున, కార్డుదారులు తమకు సమీపంలోని ఏ రేషన్ షాప్ నుండైనా సరుకులు పొందవచ్చని, ఈ సౌకర్యాన్ని రైస్ కార్డుదారులందరూ సద్వినియోగం చేసు కోవచ్చన్నారు. 65 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు లేదా అంగ వైకల్యం ఉన్నవారు లేదా అనారోగ్యముతో మంచం మీద ఉన్న కార్డుదారుల ఇంటి వద్దకే.. డీలరు 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 గం. నుండి 4 గం. లోపల రేషన్ సరుకులను పంపిణీ చేస్తారని జేసీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## యోగ ఆంధ్ర అవగాహన ర్యాలీ



**శ్రీకాళహస్తి/ పెన్ పవర్ /ప్రతినిధి/ మే 31 :** శ్రీకాళహస్తి లో యోగ ఆంధ్ర ప్రోగ్రాం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి డి.ఎస్.పి నరసింహమూర్తి వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగి నది. డి.ఎస్.పి నరసింహ మూర్తి ఆధ్వర్యంలో నాలుగుమాడా వీధుల్లో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించా రు. ఈ సంధర్భంగా డి.ఎస్.పి నరసింహ మూర్తి మాట్లాడుతూ యోగా పైన యోగా వలన కలిగే ఉపయోగాలు గురించి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సబ్ డివిజ న్ సిఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు నేల ఆరోగ్య సంరక్షణ, సుస్థిర పత్తి ఉత్పత్తి పద్ధతులపై అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ మే 31 :** రైతులకు నేల ఆరోగ్య సంరక్షణ, సుస్థిర పత్తి ఉత్పత్తి పద్ధతులపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నేల ఆరోగ్య సంరక్షణ, పత్తిలో పంట రక్షణ యాజమాన్యం బుక్ లెట్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో అత్యధికంగా సాగు చేపడుతున్న పత్తి పంట సాగు లో సుస్థిరమైన పద్ధతులు ప్రవేశపెట్టడానికి మారి స్వచ్ఛంద సేవా సంస్థ, జిల్లా వ్యవసాయ శాఖ తో కలిసి ఒక వినూత్నమైన Better Cotton Project కార్యక్రమం కోడుమూరు, దేవనకొండ మండలాల్లో అమలు చేస్తున్నారన్నారు.. దాదాపుగా 8 వేల 75 మంది రైతులతో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా రైతులకు సుస్థిర పత్తి ఉత్పత్తి పద్ధతులపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నేల ఆరోగ్య సంరక్షణ, పత్తి సాగులో నేల ఆరోగ్య నిర్వహణ వాతావరణ మార్పులను తట్టుకునే ప్రకృతి అనుకూల వ్యవసాయ పద్ధతులు, పత్తి సాగులో ఉత్తమ సస్యరక్షణ పద్ధతులు, బెటర్ కాటన్ సూత్రాలు, ప్రమాణాలు, సూచికలు, పత్తి పింజ నాణ్యత కాపాడుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై బుక్ లెట్స్ ప్రచురించి అవగాహన కల్పించడం జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి పి.యల్.వరలక్ష్మి, మారి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.మురళి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ చౌకదుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ

### టీడీపీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్



**పలమనేరు మే 31, (పెన్ పవర్) :** పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకుల చౌక ధరల దుకాణాలలోనే ఇకపై అందించ నున్నట్లు గంగవరం మండల టీడీపీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్ తెలిపారు.గత ప్రభుత్వంలో ఈ దుకాణాలను మూసేసి,ఇంటింటికి వాహనాల ద్వారా అందిస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు.ప్రభుత్వ సొమ్ము కోట్లాది రూపాయలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేసి, ఇంటింటికి ఇవ్వడం మానేసి నెలలో 1లేదా 2రోజులు మాత్రమే గ్రామాల్లో వాహనం నిలిపి ఇవ్వడంతో ఎంతోమంది పేదలకు ఆ సరుకులు అందక ఇబ్బందులుపడ్డారు. ఆ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకొని,కూలి పనులకు పోలేక ఇబ్బందులు పడ్డారు. మిగిలిన రేషన్ బియ్యం, సరుకులను అక్రమంగా తరలిస్తున్న విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపింది. వేలాది టన్నుల అక్రమ బియ్యాన్ని కాకినాడ,విశాఖ పోర్టుల్లో పట్టుకుంది. వీటిని అరికట్టేం దుకు, ప్రతీ పేద కుటుంబానికి రేషన్ సరుకులు అందించేందుకు ఇకపై ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 12 గం.ల వరకు అలాగే సాయంత్రం 4గం. ల నుండి 8 గం.ల వరకు రేషన్ డీలర్ల దుకాణాల వద్ద అందించనున్నాము. దీని ద్వారా రద్దీని తగ్గించడమే కాకుండా,ప్రతీ ఒక్క కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంది. అంతేకాకుండా దివ్యాంగులకు,65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పించిందన్నారు.ఈ సదుపాయాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందులో ఆయనతో బాటు కార్యదర్శి ప్రతాప్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని సన్మానించిన రేషన్ డీలర్లు



**పలమనేరు మే 31, (పెన్ పవర్) :** నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన రేషన్ డీలర్లు పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని శనివారం ఘనంగా సన్మానించారు. నేటి నుంచి రేషన్ దుకాణాలలో డీలర్ల ద్వారానే నిత్యావసర సరుకుల పంపిణికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని హర్షిస్తూ పలమనేరు రూరల్, గంగవరం, పెద్దపంజాణి మండలంలోని డీలర్లు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి సంభరాలు చేసుకున్నారు. ఎండియు (మొబైల్ డిస్పెన్సరి యూనిట్) వాహనాలను తొలగించి రేషన్ సరుకుల పంపిణిని డీలర్లు చేపట్టే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామమని కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేసారు. ప్రజలకు ఏమాత్రం ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా నిత్యావసరాల పంపిణి చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘ నాయకులు విశ్వనాథరెడ్డి, మునిరత్నం,వినోద్, గంగిరెడ్డి తదితరులున్నారు.

## ఇకపై నెలలో 15 రోజుల పాటు... రోజు రెండు పూటల...



**పెన్ పవర్ మే 31 :** పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకుల చౌక ధరల దుకాణాలు గత ప్రభుత్వంలో మూసేసి, ఇంటింటికి అందిస్తాం అని రూ.1600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేసి, ఇంటింటికి ఇవ్వడం మానేసి నెలలో 1-2 రోజులు మాత్రమే జంక్షన్లలో వాహనం నిలిపి ఇవ్వడంతో ఎంతోమంది పేదలకు ఆ సరుకులు అందక ఇబ్బందులుపడ్డారు. ఆ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకొని, చిరుద్యోగాలకి సెలవు పెట్టుకోవాల్సి వచ్చేది. మిగిలిన రేషన్ బియ్యం, సరుకులను అక్రమంగా తరలిస్తున్న విషయంపై గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపింది. వేలాది టన్నుల అక్రమ బియ్యాన్ని కాకినాడ, విశాఖ పోర్టుల్లో పట్టుకుంది. వీటిని అరికట్టేందుకు, ప్రతీ పేద కుటుంబానికి రేషన్ సరుకులు అందించేందుకు ఇకపై ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు.. ఉదయం 8 గం.ల నుంచి 12 గం.ల వరకు అలాగే సాయంత్రం 4గం. ల నుండి 8 గం.ల వరకు రేషన్ డీలర్ల దుకాణాల వద్ద అందించనున్నాము. దీని ద్వారా రద్దీని తగ్గించడమే కాకుండా, ప్రతీ ఒక్క కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంది.

## అత్యుత్తమ గ్రామంగా తీర్చిదిద్దుతాం



**వైఎస్ఆర్ కడప పెన్ పవర్,మే 31 :** ఎస్.ఉప్పల పాడు ఆదర్శ గ్రామాన్ని అత్యుత్త గ్రామంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. శనివారం జమ్మలమడుగు మండలంలోని ఎస్ ఉప్పలపాడు ఆదర్శ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. ఎస్ ఉప్పలపాడు గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో సహకారం అందించిన గ్రామస్తులను ఈ సందర్భంగా అభినందించారు. రాబోవు కాలంలో మీ గ్రామాన్ని ఆంధ్రప్రదేశ్లోనే కాకుండా భారతదేశంలో అత్యుత్తమ ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ గ్రామాన్ని మనోహర్ రెడ్డి దత్తత తీసుకొని అభివృద్ధి చేసినందుకు ప్రత్యేకంగా అభి నందనలు తెలిపారు. గ్రామస్తుల ముఖంలో అభివృద్ధిని సాధించాం అన్న ఆనందం కనిపిస్తోందన్నారు.

గ్రామంలో మౌలిక సదుపాయా లన్నీ బాగున్నాయన్నారు. గ్రామంలో ప్రతి ఇంటి నుండి డిగ్రీ వరకు చదువుకోవాలని కోరారు. కుల మత భేదా స్త్రీ పురుష బేదాలు లేకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ అభివృద్ధి సాధించినప్పుడే ఆదర్శప్రాయంగా నిలుస్తార న్నారు. గ్రామంలో 100% అక్షరాస్యత సాధిస్తామని తీర్మానం చేయాలన్నారు. గ్రామంలో సంతకం రానివారు ఎవరు ఉండకూడదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ప్రతి నిరుపేద అభివృద్ధి చెందా లని లక్ష్యంతో పి.4 విధానాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. మనం సమాజం ద్వారా అభివృద్ధి చెందుతున్నామని ప్రతి ఒక్కరూ తిరిగి సమాజానికి ఎంతోకొంత సేవలు అందించాలని అన్నారు. మీ గ్రామంలో ఉన్న నిరు పేదలను కనీస స్థాయికి తీసుకురావాల న్నారు. బాగా అభివృద్ధి చెందిన రైతులు ఇతర రైతులకు మెలకువలు నేర్పించి సహకారం అందించి వారి అభివృద్ధికి కూడా కృషి చేయాలన్నారు. అలాగే గ్రామంలో ఉన్న రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని గ్రామస్తులకు తెలిపారు అలాగే ఆర్డీవో ఆధ్వర్యంలో రెవిన్యూ సమస్యలు పరిష్కరించడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. గ్రామస్తులు ప్రతిపాదించిన రోడ్లు కమ్యూనిటీ హాలు, పాఠశాల కాంపౌండ్ వాల్ పనులను పూర్తి చేసినందుకు కృషి చేస్తామన్నారు.

అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం గ్రామంలోని కమ్యూనిటీ హాల్ ను అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా ఎస్ ఉప్పలపాడు ఆదర్శ గ్రామం జ్ఞానపార్వతి విద్యానికేతన్ పాఠశాలను సందర్శించి పిల్లల చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలినడకన గ్రామంలో తిరుగుతూ గ్రామ ప్రజలతో మమేకమై పింఛన్లు సమయానికి అందుతున్నాయా గ్రామస్తులను అడిగి తెలుసు కున్నారు. గ్రామంలో తాగునీటి వసతులపై ఆరా తీశారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కరివేపాకు పంటను పరిశీలించి ఎకరాకు ఎంత ఆదాయం వస్తుంది ఎలాంటి ఎరువులు వాడుతున్నారు.మొక్కలకు ఏమైనా తెగులు వస్తున్నాయా తదితర అంశాలపై రైతులతో మాట్లా డారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో సాయి శ్రీ,,డ్వామా పిడి ఆదిశేషారెడ్డి, డిఆర్డిఏ ఇన్చార్జి పిడి రాజ్యలక్ష్మి, జిల్లా పంచా యతీ అధికారిని రాజ్యలక్ష్మి, జిల్లా పర్యాటక శాఖ ఇంచార్జి అధికారి సురేష్, సర్పంచ్ అక్కల దేవి,గ్రామ పెద్దలు మనోహర్ రెడ్డి, తశ్రీనివాసుల రెడ్డి,ఓబుల రెడ్డి, గ్రామస్తులు, తదితరులు

## ఇళ్ళ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

**(మొదటి పేజీ తరువాయి)** తహసీల్దార్, గూడూరు మున్సిపల్ కమిష నర్లను ప్రశ్నించారు. పత్తికొండ డివిజన్ లో 457 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని, విఆర్ఓ లు ఇంటి ఇంటికి వెళ్ళి వెరిఫై చేసి, ఇళ్ళ స్థలాలు లేని పేదలచే దరఖాస్తు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారు లను ఆదేశించారు.రెగ్యులరైజేషన్ కింద వచ్చిన 330 దరఖాస్తులను వెరిఫై చేసి త్వరితగతిన డిస్పోస్ చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారు లను ఆదేశించారు.. జూన్ 10వ తేదీ లోపు రోజుకు 250 ఇళ్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. ఆర్ సి, ఆర్ ఎల్ స్థాయిలో ఉన్న ఇళ్లను పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గత వారం రోజులుగా పురోగతి చూపని మండలాల అధికారులను ఇక్కడికి పిలిపించాలని కలెక్టర్ హౌసింగ్ పీడీని ఆదేశించారు. అలాగే జూన్ 5వ తేదీ లోపు పెండింగ్ లో ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను కూడా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం కిసాన్ వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ లను ఆదేశించారు. సీసీఆర్సీ కార్డులకు 25 వేల లక్ష్యాల్ని కేటాయిస్తే 1125 మాత్రమే చేశారని, త్వరితగతిన కేటాయించిన లక్ష్యాల్ని సాధించాలని కలెక్టర్ తహసీల్దార్ లను ఆదేశించారు. పాజిటివ్ పర్సెప్షన్ కి సంబంధించి పెన్షన్, ఫర్టిలైజర్, జిఎస్డబ్ల్యూఎస్ సర్వీసులు, హౌసింగ్, ఉపాధి హామీ పనులు, విద్యుత్, రేషన్, తదితర 16 అంశాల మీద రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్ఎస్, క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రజల నుండి తీసుకుంటున్న ఫీడ్ బ్యాక్‌కి సంబంధించిన నివేదికలను సచివాలయం వారీగా పంపించడం జరుగుతుందని సంబంధిత ఆర్డీఓ, తహసిల్దార్ , ఎంపిడిఓ లు తనిఖీ చేసి ప్రతి నెల నివేదికలు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. పిఎం సూర్యఘర్ కు సంబంధించి 80 వేల రిజిస్ట్రేషన్ లు చేయడం జరిగిందని, వారితో మాట్లాడి, రుణాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి దేవస్థాన వేద పండితుడి సస్పెండ్



**శ్రీకాళహస్తి /పెన్ పవర్/ ప్రతినిధి/ మే 31 :** శ్రీ కాళహస్తీశ్వర దేవస్థానంలో వేద పండితునిగా విధులు నిర్వహిస్తున్న మారుతి శర్మను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ ఈవో బాపిరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం సినీ హీరో శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి రాఘవేంద్ర స్వామి దేవస్థానంలో ప్రత్యేక హెూమం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో మారుతి శర్మ పాల్గొనడంపై ఎండోమెంట్ 30 /1987 చట్టం కింద ఆయన పై చర్యలు తీసుకున్నారు.

## ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా- ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, మే 31 :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లతో పేదలకు ఆర్థిక భరోసా కలుగుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం ఎమ్మెల్యే స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని బీడీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ అభివృద్ధికి బాటలు వేస్తూ,సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పోట్లపూడి రాజేష్, నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,నిత్యం కృష్ణారెడ్డి, షేక్ షరీఫ్, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం




**సూళ్లూరుపేట, పెన్ పవర్ ప్రతినిధి, మే 31 :** సూళ్లూరుపేట ఎస్వీ ఎస్ఎస్సి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని జరిపారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఎల్ బి శంకర్ శర్మ అధ్యక్షత వహించి ధూమపానం వల్ల యువత భయంకరమైన క్యాన్సర్ వ్యాధి బారిన పడుతుందని ఈ ధూమపానాన్ని నిర్మూలించాలని విద్యార్థినీ విద్యార్థులకు తెలియజేశారు అంతే కాకుండా దీనిపై ప్రజలలో అవగాహన కోసం కళాశాల ఉపాధ్యాయులు మరియు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు ఈ ర్యాలీలో "ధూమపానం వద్దు ఆరోగ్యమే ముద్దు" అనే నినాదాన్ని విద్యార్థులు గట్టిగా తెలియజేశారు ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసులు ఎన్సిసి కోఆర్డినేటర్ మేజర్ జే.సుబ్రహ్మణ్యం సీనియర్ ఉపాధ్యాయులు నాగభూషణం పాల్గొన్నారు.

## సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

**సూళ్లూరుపేట, పెన్ పవర్ ప్రతినిధి, మే 31 :** సూళ్లూరుపేట ఎస్వీ ఎస్ఎస్సి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు మే 21 నుండి జూన్ 21 వరకు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం లో భాగంగా 31/05/2025 న కళాశాల లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఎల్ బి శంకర్ శర్మ గారు అధ్యక్షత వహించి యోగ వల్ల మానసిక ఒత్తిడిని ఎదుర్కొనే శక్తి కలుగుతుందని, శారీరకంగా దృఢం కాగలరని తెలియజేశారు . ప్రతి ఒక్కరు ప్రతి రోజు ఒక గంట యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని సూర్య నమస్కారాలు, వివిధ రకాలైన యోగాసనాలు( వృక్షాసన, త్రికోణాసన, ఉత్తనాసన, భుజంగాసన, ముక్తాసన మొదలైనవి ) మరియు ప్రాణామాయము చేశారు అంతేకాకుండా ఈ కార్యక్రమం గురించి అందరికీ అవగాహన రావాలని కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.